## చొప్పదండిలో చిరుత కలకలం

చొప్పదండి, జూన్ 10 : చొప్పదండిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం అర్ధరాత్రి సమయంలో చిరుతపులి పిల్ల సంచరించిందనే వదంతులు కలకలం రేపాయి. రాత్రి ఒకటిన్నర గంటల సమయంలో చిరుత పిల్ల పాత ఆఫీసు సమీపం నుంచి వెళ్తుండగా తాము కళ్లారా చూశామని, భయంతో లారీ క్యాబిన్‌లోకి వెళ్లి పడుకున్నామని కొందరు డ్రైవర్లు సోమవారం ఉదయం మార్కెట్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో వారు సీసీ పుటేజీ పరిశీలించగా, రాత్రి ఒకటిన్నర గంటల సమయంలో ఒక జంతువు వెళ్లినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయింది. కాగా, సదరు జంతువు చిరుత పులి అంటూ వాట్సాప్ గ్రూపుల్లో మెస్సేజ్‌లు వైరల్ కావడంతో మార్కెట్ యార్డు సమీపంలోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై అటవీశాఖ అధికారులను అడుగగా, చొప్పదండిలో చిరుత సంచరించే అవకాశం లేదని, అది జంగపిల్లి కావచ్చని పేర్కొన్నారు.

## ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్లు

కార్పొరేషన్, జూన్ 10: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల పథకాలకు సంబంధించి దరఖాస్తుదారుల పరిశీలన, ఎంపిక కోసం నగర పాలక సంస్థలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని సోమవారం నగర కమిషనర్ శ్రీనివాస్‌కు పలువురు కార్పొరేటర్లు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన కౌంటర్లు 60 డివిజన్లకు సరిపోవడం లేదన్నారు. 10 డివిజన్లకు ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బుచ్చిరెడ్డి, యాదయ్య, గంట కల్యాణీ శ్రీనివాస్, ప్రసాద్, బండ సుమారమణ తదితరులు పాల్గొన్నారు.

## యథేచ్ఛగా బెల్ట్ షాపులు

గంగాధర, జూన్ 10: మండలంలో వివిధ గ్రామాల్లో బెల్ట్ షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. మద్యం దుకాణాల నుంచి నిర్వాహకులు బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తుండగా, అక్కడ ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు మందు బాబులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా మద్యం దుకాణాల్లో బీర్ల కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని, బీరు ధర రూ.150 నుంచి రూ.160 ఉండగా బెల్టు షాపుల్లో మాత్రం రూ.200 నుంచి రూ.230 వరకు విక్రయిస్తూ నిర్వాహకులు అందిన కాడికి దోచుకుంటున్నారని చెబుతున్నారు. దీనిపై సంబంధిత శాఖ అధికారి నాగేశ్వర్‌రావును వివరణ కోరగా.. సదరు విషయంపై పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## రేకుర్తి కంటి దవాఖానకు ఐఎస్‌వో సర్టిఫికెట్లు



దవాఖాన చైర్మన్‌కు ఐఎస్‌వో సర్టిఫికెట్లను అందజేస్తున్న అదనపు కలెక్టర్

విద్యానగర్, జూన్ 10: రేకుర్తిలోని లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మడేకర్ ఉదార కంటి దవాఖానకు ఐఎస్‌వో సర్టిఫికెట్లను సోమవారం అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్ అందించారు. హాస్పిటల్‌లోని విభాగాలను పరిశీలించారు. పరికరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న సేవలను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు కంటి అద్దాలు ఇస్తున్నందుకు హాస్పిటల్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. దవాఖానలోని శుభ్రతను చూసి అభినందించారు. కార్యక్రమంలో దవాఖాన చైర్మన్ కొండ వేణుమూర్తి, కోల అన్నారెడ్డి, శివకాంత్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మహాశక్తి ఆలయ చతుర్దశ వార్షికోత్సవం

కమాన్‌చౌరస్తా, జూన్ 10 : జిల్లా కేంద్రంలోని శ్రీ మహాశక్తి ఆలయం 14వ (చతుర్దశ) వార్షికోత్సవానికి ముస్తాబైంది. ఇందులో భాగంగా మంగళవారం శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మీ, శ్రీ మహాసరస్వతీ, శ్రీ లక్ష్మీగణపతి, శ్రీ అనంత నాగేంద్ర స్వామి వార్లకు జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం దేవాలయ నిర్వాహకుడు, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 4:30 గంటలకు దేవతా మూర్తులకు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం జగద్గురువులు అనుగ్రహ భాషణం చేస్తారు. సాయంత్రం 7 గంటలకు సామూహిక కుంకుమ పూజలు, లలిత సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

## ఓవర్ లోడ్‌తో టిప్పర్లు.. ప్రయాణికులకు ఇబ్బందులు

కరీంనగర్ రూరల్, జూన్ 10: పరిమితికి మించి మట్టిలోడ్‌తో దూసుకెళ్తున్న టిప్పర్లు ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. సోమవారం చొప్పదండి వైపు నుంచి ఓవర్ లోడ్‌తో నగరం వైపు వస్తున్న ఓ టిప్పర్ నుంచి మట్టి పెళ్లలు హైదరాబాద్ వైపు వెళ్తున్న కారుపై పడ్డాయి. నగునూర్ గ్రామం వద్ద జరిగిన ఈ ప్రమాదంలో కారు అద్దాలు పగిలిపోగా, డ్రైవర్ అప్రమత్తతతో అందులోని ప్రయాణికులకు మాత్రం ప్రమాదం తప్పింది. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని, అధికారులు ఓవర్ లోడ్‌తో వచ్చే మట్టి టిప్పర్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## దమ్మికాకాయ్ క్రీడాకారుల సత్తా

కొత్తపల్లి, జూన్ 10 : జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో దమ్మికాకాయ్ కరాటే అకాడమీకి చెందిన క్రీడాకారులు బెస్ట్ టీం కప్‌ను కైవసం చేసుకున్నట్లు అధ్యక్షుడు ఆర్ ప్రసన్నకృష్ణ పేర్కొన్నారు. అకాడమీకి చెందిన క్రీడాకారులు రాంచరణ్ బంగారు పతకం, మధుశ్రీ రెండు బంగారు పతకాలు, శ్రీతిక్‌నందన్ రెండు బంగారు, హర్షద్ అలీ రెండు బంగారు, శివ తనుజ్ రెండు బంగారు పతకాలు, విష్ణురాజ్ రెండు బంగారు, రియాన్ వర్మ బంగారు, రజత, వేదాంక్ బంగారు, కాంస్యం, అక్షర బంగారు, రజత, రచిత్‌వర్మ బంగారు, రజత, విరాట్ బంగారు, రజతం, వేదాన్షి బంగారు, రజతం, సామ్రాట్ రజతం, కాంస్యపతకాలు సాధించారు. పలు విభాగాల్లో అత్యధిక పతకాలతో బెస్ట్ టీంకప్‌ను కైవసం చేసుకున్నట్లు అధ్యక్షుడు పేర్కొన్నారు. వీరిని అకాడమీ ప్రధాన కార్యదర్శి బంగారి సంతోష్, కోచ్ ఏ వినోద్, బీ వైష్ణవి అభినందించారు.



రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించిన దమ్మికాకాయ్ అకాడమీ క్రీడాకారులు

### ఉద్యోగమిప్పిస్తానంటూ మోసం



నాకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం చేసిన వ్యక్తిని గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలి. కలెక్టరేట్‌లో ఉద్యోగం చేస్తున్నానంటూ శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన మాచర్ల రాజయ్య అనే వ్యక్తి పలు దఫాలుగా రూ.3లక్షలు తీసుకున్నాడు. తప్పుడు నియామక పత్రాలు అందజేసి, నన్ను, నా భర్తను అనేక ఇబ్బందులకు గురిచేశాడు. దీనిపై ప్రశ్నిస్తే, మొఖం చాటేశాడు. ఆయన గ్రామానికి వెళ్లి నిలదీస్తే మమ్మల్ని బెదిరింపులకు గురిచేస్తున్నాడు. రాజయ్యపై కఠిన చర్యలు తీసుకుని మా డబ్బులు మాకు ఇప్పించాలి.

*–మౌల్కార్ కవిత, హన్‌మాన్‌నగర్, కరీంనగర్*

### దశాబ్దాలు గడిచినా పట్టాదారు పాసు పుస్తకం రాలె



రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో మా తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమి నా పేర మార్చలేదు. పట్టాదారు పాసు బుక్కు ఇవ్వలేదు. 30 ఏళ్ల నుంచి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగి తిరిగి వేసారి పోతున్న. ధరణి వచ్చినంక నాకు న్యాయం జరుగుతుందనుకున్నా. కానీ, అధికారుల నిర్లక్ష్యంతో నాకు అన్యాయమే జరిగింది. గతంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన, వెంటనే సమస్య పరిష్కరించాలంటూ కలెక్టర్ ఆదేశించినా, రెవెన్యూ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. అందుకే మరోసారి ఉన్నతాధికారులకు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన. ఇప్పటికైనా తహసీల్ అధికారులు స్పందించి, న్యాయం చేయాలి.

*–మందపల్లి నాగేందర్, గుండి గ్రామం, రామడుగు మండలం*

# సారూ.. సమస్యలు పరిష్కరించాలె

- ప్రజావాణిలో సామాన్యుల గోడు
- మొత్తం 194 అర్జీలు

కలెక్టరేట్, జూన్ 10 : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలంటూ ప్రజావాణిలో ప్రజలు అధికారుల ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. సుదీర్ఘ విరామానంతరం సోమవారం నుంచి తిరిగి ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చి. తాము పడుతున్న ఇబ్బందులు, పెండింగ్‌లో ఉన్న సమస్యలపై అధికారులకు లిఖిత పూర్వకంగా వెల్లడించారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియానికి చేరుకుని, అధికారులకు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో మొత్తం ప్రజల నుంచి 194 దరఖాస్తులు రాగా, వాటిని పరిశీలించి, సత్వరమే పరిష్కారమార్గాలు చూపాలంటూ సంబంధిత విభాగాల సిబ్బందిని అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్ ఆదేశించారు. వీటిపై ఎప్పటికప్పుడు తమకు సమాచారం తెలియజేయాలంటూ సదరు అధికారులకు సూచించారు. కాగా, సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం, స్థానిక సమస్యలపై అధికారులకు అధిక సంఖ్యలో ఫిర్యాదులు అందాయి.



అర్జీలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్

### మురుగు కాల్వలు శుభ్రం చేయించండి



దేవుడు కరుణించినా పూజారి కనికరించడం లేదన్నట్లుగా మా పరిస్థితి మారింది. నగరంలోని 19వ డివిజన్ పరిధిలో గల రేకుర్తిలోని మా ఇళ్ల ముందు ఉన్న మురుగు కాలువల్లో చెత్తాచెదారం తొలగించాలని మేయర్ ఆదేశించినా, కమిషనర్ మాత్రం చోద్యం చూస్తున్నారు. సిబ్బందిని పురమాయించి, చెత్త తొలగించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. ఇండ్ల ముందు మురుగు పేరుకుపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తున్నది. కోడ్ ఎత్తేసినా అధికారులు ఇప్పటికీ అదే సాకుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సత్వరమే మురుగు తొలగించి కంపు బారి నుంచి మమ్మల్ని కాపాడాలి.

*– 19వ డివిజన్ వాసులు*

### డీఆర్‌డీఏ నిర్లక్ష్యంతో దివ్యాంగులకు అన్యాయం



జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల నిర్లక్ష్యంతో అర్హులైన దివ్యాంగులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నది. వైకల్య నిర్ధారణ కోసం హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రత్యేక సదరం క్యాంపు ఏర్పాటు చేసి, దివ్యాంగులుగా గుర్తించిన వారికి ఇప్పటివరకు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయలేదు. ఏళ్లు గడుస్తున్నా సాయమందక పోవడంతో వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులనెదుర్కొంటున్నాయి. ప్రభుత్వ దవాఖాన, డీఆర్‌డీఏ సిబ్బంది నిర్వాకంతో వందల మంది దివ్యాంగులు ప్రభుత్వ సాయానికి నోచుకోలేకపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి విచారణ జరపాలంటూ ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశా.

*–జక్కం సంపత్, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు*

# ఇంటింటి సర్వే పక్కాగా చేయాలి

- నల్లా కనెక్షన్ ఉందా.. సరఫరా అయ్యే నీరు సరిపడుతుందా? వివరాలు సేకరించాలి
- సిబ్బందికి టీవోటీల శిక్షణ

శంకరపట్నం, జూన్ 10: మిషన్ భగీరథ ఇంటింటి నీటి సరఫరాపై సర్వే పక్కాగా చేయాలని టీవోటీ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం కేశవపట్నం గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలలో మిషన్ భగీరథ సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మిషన్ భగీరథ పథకంలో భాగంగా ప్రతి ఇంటిని సర్వే చేయాలన్నారు. ఇంటికి నల్లా కనెక్షన్ ఉందా.. ఆ ఇంటిలో ఎంత మంది నివసిస్తున్నారు.. తాగునీటి నాణ్యత.. సరఫరా అయ్యే నీరు సరిపడుతుందా.. తదితర అంశాలపై సర్వే నిర్వహించాలని తెలిపారు. అలాగే ఇంటి యజమాని ఫొటో పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. రోజుకు 25 ఇండ్ల చొప్పున 10 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని వెల్లడించారు. పూర్తి వివరాలతో కూడిన సర్వే నివేదికను పంచాయతీ కార్యదర్శులు, వీవోఏలు, అంగన్‌వాడీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీవో బషీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వీణవంక, జూన్ 10: మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీడీవో శ్రీధర్ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ ఇంటింటి నీటి సరఫరా సర్వేపై అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల వీవోలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన టీవోటీ రమేశ్ మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఉన్నదా? లేదా? అని సర్వే చేయాలని అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సిబ్బందికి, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రభాకర్, మిషన్ భగీరథ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వీణవంకలో సర్వేపై అవగాహన కల్పిస్తున్న టీవోటీ ట్రైనర్ రమేశ్

### క్షేత్రస్థాయిలో సర్వే సిబ్బంది ఇక్కట్లు

కరీంనగర్‌రూరల్, జూన్ 10: కరీంనగర్ మండలంలో మిషన్ భగీరథ ఇంటింటి నీటి సర్వే ప్రారంభంకాగా, ఇందులో భాగంగా వివరాలు నమోదు చేయాల్సిన యాప్‌పై అవగాహన కల్పించకపోవడంతో సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇక్కట్లపాలవుతున్నారు. సోమవారం నుంచి ప్రారంభించిన ఈ సర్వేకు వార్డుల వారీగా పంచాయతీ సిబ్బందితో పాటు అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లను కేటాయించారు. 10రోజుల్లోగా ప్రతి ఇంటికీ వెళ్లి మిషన్‌భగీరథ కనెక్షన్ ఉందా? లేదా? పరిశీలించి, ఇంటి యజమాని పేరుతో లొకేషన్ షేర్ చేస్తూ యాప్‌లో వివరాలు పొందుపరచాలని లక్ష్యం విధించారు. అయితే యాప్‌ను లొకేషన్ లేకుండా షేర్ చేయడం సిబ్బందికి కొంత ఇబ్బంది కలిగిస్తున్నది. సంబంధిత అధికారులను యాప్ వినియోగంపై సిబ్బంది సలహాలు అడుగుతున్నా వారు సైతం విఫలమవుతున్నారు. దీనివల్ల మొదటి రోజు కొందరు సిబ్బంది 10 ఇండ్లకు మించి సర్వే చేయలేకపోయారు.



కరీంనగర్ రూరల్: నగునూర్‌లో సర్వే చేస్తున్న సిబ్బంది

## ఆయుర్వేద మాత్రల పంపిణీ



చిన్నారికి ఆయుర్వేద మాత్ర వేస్తున్న మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, జూన్ 10: నగరంలోని 33వ డివిజన్ భగత్ నగర్ అయ్యప్ప ఆలయంలో జై శ్రీమన్నారాయణ భావ ఆయుర్వేద, భగత్‌నగర్ గోష్ఠి ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన శాస్త్రీయ ఆయుర్వేద మెడికల్ క్యాంపును నగర మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం భగత్‌నగర్ గోష్ఠి వారి ఆయుర్వేద మాత్రలను చిన్నారులకు వేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, చినజీయర్ స్వామి ఆశీస్సులతో పిల్లల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన స్వర్ణ అమృత ప్రాశన మాత్రల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఆయుర్వేద మాత్రలు పిల్లలకు ఎనిమిది రకాల ప్రయోజనాలను కలిగిస్తున్నాయని, ప్రతి నెలా ఒకసారి 16 సంవత్సరాల్లోపు పిల్లలకు వీటిని అందిస్తున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో భగత్‌నగర్ గోష్ఠి సభ్యులు, జై శ్రీమన్నారాయణ ఆయుర్వేద సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు


కరీంనగర్‌రూరల్, జూన్ 10: బొమ్మకల్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పరంపోగు భూమిసర్వే నంబర్ 593లో 0.21 గుంటల భూమి అధికారుల అండతో ఆక్రమణకు గురవుతున్నదని స్థానికులు ఏ తిరుపతి, అసిరి తిరుపతి, దొమ్మటి బాబు తదితరులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 15 రోజులుగా యథేచ్ఛగా స్థలాన్ని చదును చేసి విక్రయించే ప్రయత్నం చేస్తున్నారని, వెంటనే స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

## బావిలో పడి యువకుడి మృతి

సైదాపూర్, జూన్ 10: మండలంలోని ఘనపూర్‌తండాకు చెందిన బానోతు ఆంజనేయులు(18) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. ఎస్ఐ ఆరోగ్యం తెలిపిన వివరాల ప్రకారం.. ఆంజనేయులు ఆదివారం రాత్రి ఇంటినుంచి బహిర్భూమికని వెళ్లాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వెతికారు. సోమవారం ఉదయం ఘనపూర్ గ్రామ శివారులోని వ్యవసాయబావి వద్ద చెప్పులు సెల్‌ఫోన్ కనిపించగా, నీటిలో గాలించగా మృతదేహం కనిపించింది. ఆంజనేయులు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# సంఘం అభివృద్ధికి సహకారం అందిస్తాం

- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్ రూరల్, జూన్ 10: దేశంలోనే పేరొందిన గట్టుదుద్దెనపల్లి విశాల సహకార సంఘం అభివృద్ధికి సహకారం అందించడంతోపాటు ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుకు తన వంతు కృషి చేస్తానని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి విశాల సహకార సంఘం ప్రధాన కార్యాలయం, షాపింగ్ కాంప్లెక్స్, గోదాంల శంకుస్థాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘం అధ్యక్షుడు అనభేరి రాధాకిషన్ రావుతో కలిసి ఆయా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, సంఘం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మండలంలో మోడల్ ఐకేపీ సెంటర్ ఏర్పాటు చేసి, రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేలా డ్రైయర్స్ మెషిన్లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రితో పాటు వ్యవసాయ మంత్రితో మాట్లాడి ఆధునిక టెక్నాలజీని రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి 400 సీట్లు రావని తాము ఎప్పుడో చెప్పామన్నారు. మోదీ ప్రజల్ని మభ్యపెట్టారని, సోషల్ మీడియా బీజేపీకి అనుకూలంగా ఉండడంతోనే ఆ మాత్రం సీట్లు సాధించిందని ఎద్దేవా చేశారు. నేషనల్ హైవే నిర్మాణంలో కోల్పోతున్న సొసైటీ భూమికి వ్యవసాయ భూమిగా ధర నిర్ణయించారని సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి కమర్షియల్‌గా మార్పించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడితో పాటు పాలకవర్గ సభ్యులు, సిబ్బంది ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కర్క అనంత రెడ్డి, పాలక వర్గ సభ్యులు, కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణ రావు, వివిధ సంఘాల డైరెక్టర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దుర్శేడ్‌లో వీధి కుక్కల బెడద

కరీంనగర్ రూరల్, జూన్ 10: దుర్శేడ్ గ్రామంలో వీధి కుక్కల బెడద పెరుగుతున్నా పంచాయతీ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం గ్రామంలో కుక్కల దాడిలో మేడ శ్రీనివాస్ అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయని తెలిపారు. కుక్కలు దాడులకు దిగుతుండడంతో వీధుల్లోకి రావడానికే జంకుతున్నామని, అనేక సార్లు గ్రామపంచాయతీ గ్రామసభలో సమస్యను ప్రస్తావించినా ఫలితం లేకపోయిందని చెబుతున్నారు. వీధి కుక్కల బెడద నుంచి తమను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## బక్రీద్‌కు ఏర్పాట్లు చేయాలి



మేయర్ సునీల్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న ఎంఐఎం కార్పొరేటర్లు

కార్పొరేషన్, జూన్ 10: నగరంలో బక్రీద్ పండుగ సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేయించాలని ఎంఐఎం కార్పొరేటర్లు సోమవారం మేయర్ సునీల్ రావును క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. నగరంలో బక్రీద్ సందర్భంగా మంచినీటి సరఫరా సక్రమంగా చేయాలని, పారిశుధ్యం లోపించకుండా చూడాలని కోరారు. ఈద్గాల వద్ద సౌండ్ సిస్టమ్, గ్రీన్ మ్యాట్ తదితర ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం కార్పొరేటర్లు తషరీఫొద్దీన్, అఖిల్‌ఫిరోజ్, మాజీ డిప్యూటీ మేయర్ షమీ, నాయకులు బర్కత్‌అలీ, అలీ తదితరులు పాల్గొన్నారు.

***అదనపు కలెక్టర్‌కు ఎంఐఎం నాయకుల వినతి***

కలెక్టరేట్, జూన్ 10: ఈ నెల 17న జరుపుకోనున్న బక్రీద్ పండుగకు నగరంలో ఘనంగా ఏర్పాట్లు చేయాలని, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్‌ని కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎంఐఎం నాయకులతో కలిసి అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పవిత్ర బక్రీద్ మాసంలో ఖుర్బానీ బలి ఇచ్చే జంతువుల్లో ఆవులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బక్రీద్ నమాజ్ చేసుకునేందుకు వీలుగా ఈద్గాల వద్ద నమాజ్ చేసే స్థలాన్ని పరిశుభ్రం చేయించాలని కోరారు. ఎండల తీవ్రత దృష్ట్యా టెంట్లు వేయించాలని, వృద్ధులకు కుర్చీల సౌకర్యం కల్పించాలన్నారు. పశు వ్యర్థాలను తరలించేందుకు వీలుగా ట్రాక్టర్లను మూడు రోజుల పాటు ముస్లిం కాలనీల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. ముస్లిం కాలనీల్లో ఇంటింటికీ బ్లీచింగ్ పౌడర్ పంపిణీ చేయాలన్నారు. అదనపు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కతలీ, నాయకులు అబ్బాస్ షమీ, అతిన, ఖమ్రొద్దీన్, అలీబాబా, ఫిరోజ్, శర్ఫుద్దీన్, సాజిద్, మజహరొద్దీన్, ఖాలీద్ తదితరులున్నారు.

## వైద్య విద్యార్థినికి చేయూత



వీణవంకలో వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న యప్‌టీవీ సిబ్బంది

వీణవంక, జూన్ 10: కనపర్తి గ్రామానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని ప్రజ్వలకు చేయూతనందించి ఉదారతను చాటుకున్నారు యప్‌టీవీ సీఈవో పాడి ఉదయ్‌నందన్‌రెడ్డి. చదువు పూర్తయ్యే వరకు అండగా ఉంటానని గతంలో ఆమెకు హామీ ఇవ్వగా, ఈ మేరకు యప్‌టీవీ సీఈవో పాడి ఉదయ్‌నందన్‌రెడ్డి తన సిబ్బంది ద్వారా సోమవారం రూ.25 వేల నగదును ప్రజ్వలకు మండల కేంద్రంలో అందజేశారు. కార్యక్రమంలో యప్‌టీవీ సిబ్బంది వెన్నంపల్లి నారాయణ, మంతెన శ్రీధర్, వంశీకృష్ణ, లోకేశ్, కుమారస్వామి, రాకేశ్, శేఖర్, నాయకులు సమిండ్ల చిట్టి, తదితరులు పాల్గొన్నారు.

## వాగేశ్వరిలో ఘనంగా వీడ్కోలు వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తిమ్మాపూర్, జూన్ 10: రామకృష్ణకాలనీలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ, సీఎస్ఈ(ఏఐ,ఎంఎల్) విభాగాల ఆధ్వర్యంలో 'నెమెసియో–2కే24' పేరుతో నిర్వహించిన వీడ్కోలు వేడుకలు అట్టహాసంగా జరిగాయి. తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు చివరి సంవత్సరం విద్యార్థులకు ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆటపాటలతో అలరించారు. విద్యా సంస్థల కార్యదర్శి గండ్ర శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ డీ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, హెచ్‌వోడీలు చంద్రమౌళి, శ్రీకాంత్‌రెడ్డి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## నీటిశుద్ధి కేంద్రం ప్రారంభం

చొప్పదండి, జూన్ 10: చిట్యాలపల్లిలో నీటిశుద్ధి కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, గుడిపాటి సురేశ్ మాట్లాడుతూ, అమరవాది జానమ్మ, అమరవాది ఆనందమ్మ, అమరవాది శ్రీనివాసరావు జ్ఞాపకార్థం రూ.4 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేసిన అమరవాది రాజేశ్వర్‌రావు, ఆనందరావు, మురళీధర్‌రావు, రమాపతిరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్నం మనోహర్, వేణుగోపాల్‌రావు, బల్మూరి శ్రీహరిరావు, బల్మూరి శంకర్‌రావు, బద్దెనపల్లి శంకర్, తిరుపతి, కటకం లచ్చయ్య, సతీశ్, మధు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జూన్ 10: ట్రాన్స్‌ఫార్మర్ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యారణ్యపురి రోడ్ నంబర్ 1, 2, 3 ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని కరీంనగర్ రూరల్ ఏడీఈ కొలుపుల రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## మేము సైతం యువసేన ఫౌండేషన్ ఔదార్యం

విద్యానగర్, జూన్ 10: పాఠశాలలు పునర్ ప్రారంభమవుతున్న సందర్భంగా మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని శివారు ప్రాంతాల్లో పేద విద్యార్థులకు లంచ్ బ్యాగులు వితరణ చేశారు. అనంతరం చిరు వ్యాపారం చేసుకునే వారికి అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు స్వప్నాశ్రీనివాస్, ప్రేమలత, రామోజీ, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన కరాటే శిక్షణ శిబిరం

తిమ్మాపూర్, జూన్ 10: మండల కేంద్రంలో వేసవికాలం సందర్భంగా నిర్వహించిన కరాటే శిక్షణ శిబిరం ముగిసింది. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన స్వచ్ఛంద సేవకుడు మాతంగి శంకర్ తన సొంత ఖర్చులతో 45రోజుల పాటు 60మంది బాలబాలికలకు ఉచితంగా కరాటే శిక్షణ ఇప్పించారు. శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారులకు సోమవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంకిడి లక్ష్మారెడ్డి, శిక్షకుడు ఎలగందుల శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న శంకర్ తదితరులు